క్లుప్తంగా

ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్ ఓటర్లకు అవగాహన



చేబ్రోలు: ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్ ఓటర్ల అవగాహన కార్యక్రమాన్ని మండల కేంద్రమైన చేబ్రోలులో బుధవారం నిర్వహించారు. తహసీల్దారు కార్యాలయం సమీపంలోని జీబీసీ రహదారిపై మానవహారం ఏర్పాటు చేసి ఓటు హక్కు విలువ గురించి ప్ల కార్డులు, నినాదాలు చేశారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు, ఇంజినీరింగ్ విద్యార్థులు, ప్రభుత్వశాఖల అధికారులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. గుంటూరు ఎంప్లాయిమెంట్ ఆఫీసు అధికారి డి.దుర్గాబాయి, స్కిల్ డెవలప్‌మెంటు ఆఫీసర్ సంజీవరావు, తహసీల్దారు కే శ్రీనివాసశర్మ, బి.శ్రీనివాసరావు, రామశేషు, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

హిందీపై ఆసక్తి పెంచుకోవాలి



కాకుమాను: మారుతున్న కాలానుగుణంగా అన్ని సబ్జెక్టులతో పాటు హిందీపై కూడా ఆసక్తి పెంచుకోవాలని ఎంఈఓ కె.ఎఫ్.కెనడీ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు బుధవారం హిందీ భాష పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న కెనడీ మాట్లాడుతూ నేటి విద్యార్థులకు తెలుగుతో పాటు అన్ని భాషలు ముఖ్యమేనని ఆయా భాషలపై ప్రతి విద్యార్థి ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థికి ప్రాథమిక స్థాయి నుండే హిందీ భాషపై పట్టు సాధించే విధంగా ఉపాధ్యాయులు తరగతులు నిర్వహించాలని ఆయన ఉపాధ్యాయులకు సూచించారు. ఈసందర్భంగా నిర్వహించిన హిందీ పరీక్షల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థినులకు సర్టిఫికెట్‌లు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 కె.విజయ్ భాస్కర్, హెచ్‌ఎం బి.సత్యం పాల్గొన్నారు.

బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు బూటకం



నెహ్రూ నగర్: బీసీలను చైతన్యం చేసి, వారి హక్కుల సాధన కోసం కృషి చేయడానికి నూతన కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర యువజన అధ్యక్షులు కుమ్మర క్రాంతి కుమార్ పేర్కొన్నారు. గుంటూరు నల్లపాడు రోడ్డులోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీల 34 శాతం రిజర్వేషన్ ప్రకటనలు కేవలం ప్రకటనలకే పరిమితం అవుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం బాపట్ల జిల్లా యువజన అధ్యక్షుడిగా పచ్చపట్ల గంగ రాజు ఎన్నికై నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి కొల్లూరి హనుమంతరావు, రేపల్లె నియోజకవర్గం యువజన అధ్యక్షులు కొనిక వెంకట్రావు, గాలి రాజు, రాకేష్, వంశీ పాల్గొన్నారు.

అవయవదానంతో మరణించినా జీవించవచ్చు

గుంటూరు మెడికల్: అవయవదానంతో మరణించినా జీవించవచ్చని గుంటూరు డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి అన్నారు. రోడ్డు ప్రమాదానికి గురై మంగళగిరి ఎయిమ్స్ హాస్పిటల్‌లో ఈనెల 14న చికిత్స కోసం చేరి, 15న బ్రెయిన్ డెడ్ అయిన విజయవాడ విద్యాధరపురానికి చెందిన ముత్యాల సరస్వతి అవయవదానం చేసినట్లు బుధవారం తెలిపారు. సరస్వతి నేత్రాలు ఎల్.వి. ప్రసాద్ కంటి ఆసుపత్రి, మూత్రపిండాలు, కాలేయం మణిపాల్ ఆస్పత్రికి అందించినట్లు చెప్పారు. అవయవదానం చేసిన ముత్యాల సరస్వతి కుటుంబ సభ్యులను అభినందిస్తూ జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, జీవన్‌ధాన్ ప్రశంసా పత్రాన్ని వారి కుటుంబ సభ్యులకు అందజేసినట్లు వెల్లడించారు.

'కూటమి' కోటీశ్వరుల ప్రభుత్వం

కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్



మంగళగిరి టౌన్: కూటమి ప్రభుత్వం కోటీశ్వరుల ప్రభుత్వమని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ విమర్శించారు. మంగళగిరి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించి, బ్యాంకుల రుణాలు, ప్రభుత్వ కాంట్రాక్టులు ఎస్సీ, ఎస్టీ ఓబీసీలకు వర్గీకరణ చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం పేదలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సీఆర్డీఏ కాంట్రాక్ట్‌లన్నీ కోటీశ్వరులకే ఇస్తున్నారని మండిపడ్డారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలను ఆర్థికంగా ఎదగనీయకుండా ప్రభుత్వం అడ్డుకుంటోందన్నారు.

పది పరీక్షలకు సన్నద్ధం

- మార్చి 17 నుంచి పరీక్షలు ప్రారంభం
- పొన్నూరులో 7 కేంద్రాలు, 1500 మంది విద్యార్థులు హాజరు
- ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు 640, ప్రైవేటు 860 మంది



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీనివాసరెడ్డి

పొన్నూరు: పరీక్షల కాలం. విద్యార్థులకు పరీక్షల ఫీవర్ వచ్చేసింది. మార్చి పరీక్షల నెల. పదో తరగతి విద్యార్థులకు ఇక 27 రోజులే మిగిలి ఉంది. నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా పాఠశాలల్లో ఇప్పటికే వంద రోజుల ప్రణాళిక అమలవుతోంది. ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. పది పరీక్షలంటే విద్యార్థుల్లో ఒత్తిడి, ఆందోళనను అధిగమించి ఉత్తీర్ణత సాధించే విధంగా నమూనా పేపర్లతో ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారు. దీంతో విద్యార్థులకు మంచి ఫలితాలు సాధించేందుకు అవకాశం లభించింది. పరీక్షల నిర్వహణకు అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నారు.

నియోజకవర్గంలో పరీక్షలు ఇలా...

పది పరీక్షలకు ఈ ఏడాది నియోజకవర్గం నుంచి మొత్తం 1500 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. అందులో పొన్నూరు పట్టణ, మండలంలోని 12 ప్రభుత్వ పాఠశాలల్లో 640 మంది విద్యార్థులు, 15 ప్రైవేట్ ఉన్నత పాఠశాలలకు చెందిన 860 మంది విద్యార్థులున్నారు. పట్టణ, పరిసర గ్రామాల్లోని 7 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు రాయనున్నారు. పదో తరగతి పరీక్షలు అనగానే విద్యార్థుల్లో హడావుడి, మానసిక ఒత్తిడి సాధారణం. విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు ఒకింత పరీక్షే. అయితే ప్రస్తుతం పదోతరగతి పరీక్షల్లో ఆరు సబ్జెక్టులు, ఏడు పేపర్ల విధానంతో విద్యార్థులపై ఒత్తిడి తగ్గింది. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 నిమిషాల వరకు పరీక్ష జరగనుంది.

పరీక్షల షెడ్యూల్

మార్చి17న తెలుగు, 19న హిందీ, 21న ఇంగ్లిష్, 24న గణితం, 26న ఫిజిక్స్, 28న బయాలజీ, 31వ తేదీన సోషల్ నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేశారు.

పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

ప్రస్తుతం పదో తరగతి విద్యార్థుల్లో ఒత్తిడి తగ్గి పరీక్షలు బాగా రాసే అవకాశాలు ఉన్నాయి. పరీక్షకు పరీక్షకు మధ్య సెలవు రావడం విద్యార్థులకు ఎంతో ఉపయోగం. ఉపాధ్యాయులు, విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి. ప్రతి పాఠశాలలో వంద శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా చర్యలు తీసుకోవాలి. ఇప్పటికే విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి అంశాల వారీగా తర్ఫీదు ఇస్తున్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాం. నూతన విధానం ద్వారా పరీక్షల సంఖ్యతో విద్యార్థులపై భారం తగ్గింది. – కె.శ్రీనివాసరెడ్డి, ఎంఈఓ, పొన్నూరు

ఘన వ్యర్థాల నిర్వహణపై అవగాహన ఉండాలి

డీపీఆర్‌సీ జిల్లా కో ఆర్డినేటర్ పద్మరాణి



మాట్లాడుతున్న డీపీఆర్‌సీ జిల్లా కో ఆర్డినేటర్

చేబ్రోలు: ఘన వ్యర్థాల నిర్వహణపై అవగాహన ఉండాలని డీపీఆర్‌సీ జిల్లా కోఆర్డినేటర్ ఎస్.పద్మరాణి పేర్కొన్నారు. స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా ఘన వ్యర్థాల నిర్వహణపై హాండ్స్ ఆన్ ట్రైనింగ్ చేబ్రోలులో గుంటూరు జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. చేబ్రోలు గ్రామ పంచాయతీకి చెందిన ఎస్ డబ్ల్యూపీసీ షెడ్‌లో నిర్వహించిన శిక్షణకు జిల్లాలోని 16 మండలాలకు చెందిన ఈఓపీఆర్డీలు, చేబ్రోలు, తుళ్లూరు, వెంగళాయపాలెం, లాం, అంగలకుదురులకు చెందిన ఐదు గ్రామపంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. పద్మరాణి మాట్లాడుతూ శిక్షణలో అవగాహన పొందిన తరువాత మండల, గ్రామస్థాయి అధికారులు గ్రామాల్లోని పంచాయతీ వర్కర్లకు, క్లాప్ మిత్రులకు, గ్రామ ప్రజలకు ఘన వ్యర్థాల నిర్వహణపై అవగాహన కల్పించేందుకు ఉపయోగపడుతుందని చెప్పారు. మూడు చెత్త బుట్టల ద్వారా చెత్త సేకరించే విధానంపై శిక్షణలో అవగాహన కల్పించారు. చెత్తను తడి చెత్త, పొడి చెత్త, హానికరమైన చెత్తను వేరు చేసి పంచాయతీ సిబ్బందికి అందించే విధంగా చైతన్యం తీసుకురావాలని కోరారు. నాడేఫ్ తొట్టులలో ఉన్న వాన పాముల ఎరువును డీఎల్‌పీఓలు, డీపీఆర్‌సీ జిల్లా కోఆర్డినేటర్‌లు పరిశీలించారు. నూతనంగా ఏర్పాటు చేసిన నాడేఫ్ తోట్టులలో వానపాములను వేశారు. శిక్షణలో భాగంగా గ్రామంలో కాలినడక ద్వారా రాలిన చెట్ల ఆకులు, వ్యవసాయ వ్యర్థాలు నిర్వహణ గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చేబ్రోలు ఎంపీడీఓ ఎ.ఉమాదేవి, డీఎల్‌పీఓలు, కె.శ్రీనివాసరావు, వి.స్వరూపరాణి, ఈఓపీఆర్‌డీ టి.ఉషారాణి పాల్గొన్నారు.

క్రీడల్లో జీఎస్టీ ఉద్యోగులకు బంగారు పతకాలు



పతకాలు సాధించిన అధికారులను సత్కరిస్తున్న కమిషనర్ సాధు నరసింహారెడ్డి

లక్ష్మీపురం: ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన సౌత్ ఇండియా సెంట్రల్ రెవెన్యూ క్రీడా పోటీలలో సెంట్రల్ జీఎస్టీకి చెందిన ముగ్గురు ఉద్యోగులు నాలుగు బంగారు, రెండు రజిత పతకాలు సాధించారు. గుంటూరు కన్నవారితోట జీఎస్టీ భవన్‌లో పతకాలు తెచ్చిన ఉద్యోగులకు బుధవారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ శాఖ కమిషనర్ సాధు నరసింహారెడ్డి మాట్లాడుతూ.. ఈ విజయాలు ఉద్యోగుల అంకితభావం, కృషి, టీమ్ వర్క్‌కు నిదర్శనమని పేర్కొన్నారు. వృత్తిపరమైన బాధ్యతల్లోనే కాకుండా, క్రీడల్లోనూ ప్రావీణ్యత సంపాదించడం హర్షణీయమని చెప్పారు. సూపరింటెండెంట్ పి.వెంకటాచలం, లాన్ టెన్నిస్‌లో 40 ప్లస్ సింగిల్స్, 40 ప్లస్ డబుల్స్, 50 ప్లస్ డబుల్స్‌లో మూడు బంగారు పతకాలు, ట్యాక్స్ అసిస్టెంట్ పి.వెంకటేశ్వర్లు 100 మీటర్ల పరుగు పందెం 50 ప్లస్ కేటగిరిలో గోల్డ్ మెడల్ సాధించగా, ట్యాక్స్ అసిస్టెంట్ అనితకు షాట్ పుట్, డిస్కస్‌త్రో ఈవెంట్ల లో రెండు రజిత పతకాలు లభించినట్లు తెలిపారు. అనంతరం ముగ్గురు ఉద్యోగులను ఘనంగా సత్కరించి, అభినందనలు తెలిపారు. ఈ నెల 21 నుంచి 23 వరకు బెంగళూరులో నిర్వహించనున్న ఆల్ ఇండియా సెంట్రల్ రెవెన్యూ క్రీడా పోటీలకు ఆంధ్రప్రదేశ్ నుంచి ఈ ముగ్గురూ ఎంపికైనట్లు వెల్లడించారు. కార్యక్రమంలో జీఎస్టీ అడిషనల్ కమిషనర్ బి.లక్ష్మీనారాయణ, ఏసీలు వి.వెంకటేశ్వరరావు, ఎం. నాగరాజు, బి.రవికుమార్, సూపరింటెండెంట్లు గాదె శ్రీనివాసరెడ్డి, చిదేళ్ల ఈశ్వరరావు, ప్రకాష్ బాబు పాల్గొన్నారు.

23 నుంచి మహా శివరాత్రి కల్యాణ బ్రహ్మోత్సవాలు

- పెదకాకాని శివాలయంలో వేడుకలు ప్రారంభం
- కళ్యాణ బ్రహ్మోత్సవాలకు భ్రమరాంబ మల్లేశ్వరస్వామి ముస్తాబు
- మార్చి 1వ తేదీ వరకూ నిర్వహణ
- ఉత్సవాల నిర్వహణకు క్యూలైన్లు, పందిళ్ళు



పెదకాకాని శివాలయం



లీలాకుమార్, ఆలయ డీసీ

పెదకాకాని: స్థానిక శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఈనెల 23వ తేదీ నుంచి మహా శివరాత్రి కల్యాణ బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఆలయం ప్రాంగణాన్ని రంగు రంగుల పందిళ్లతో తీర్చిదిద్దారు. ఆయా ప్రాంతాల నుండి వేలాదిగా తరలివచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా స్వామిని దర్శించుకునే విధంగా ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. శివాలయం మహా శివరాత్రి పండుగ శోభ సంతరించుకుంది. ఆలయానికి విద్యుత్ అలంకరణ పనుల్లో సిబ్బంది నిమగ్నమయ్యారు. ఈ ఉత్సవాలు మార్చి 1వ తేదీ వరకూ ఘనంగా జరిపించేందుకు ఏర్పాట్లు చేశారు. ఏడు రోజుల పాటు అంగరంగ వైభవంగా, శాస్త్రోక్తముగా శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామి కల్యాణ బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ డెప్యూటీ కమిషనర్ గోగినేని లీలాకుమార్ తెలిపారు. ఈ బ్రహ్మోత్సవాల్లో భాగంగా 26వ తేదీ రాత్రి భ్రమరాంబ మల్లేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. భక్తులందరికీ ఉచిత ప్రసాదాల పంపిణీ, అన్నసంతర్పణ జరుగుతుందన్నారు. క్యూలైన్లలో తాగునీరు, మజ్జిగ, చిన్నారులకు పాలు పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకోవడం జరిగిందని వివరించారు. అన్ని శాఖల సమన్వయంతో మహా శివరాత్రి కల్యాణ బ్రహ్మోత్సవాలు విజయవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

పెదకాకాని శివాలయంలో ప్రత్యేకతలు..

పెదకాకాని శివాలయంలో యజ్ఞాల బావి నీటితో స్నానాలు, ప్రభలతో తరలివచ్చి మొక్కులు చెల్లించుకోవడం, అంత్రాలయ అభిషేకములు, ఏకవారాభిషేక పూజలు, తలనీలాలు, అన్నప్రాసనలు, నామకరణలు, చెవి పోగులు కుట్టించుట, వాహన పూజలు, ప్రత్యేకంగా చెప్పుకోవచ్చు. ముఖ్యంగా రాష్ట్రంలోనే ప్రత్యేకంగా చెప్పుకోదగిన రాహుకేతువు పూజలు అత్యంత ప్రాచుర్యం పొందినవి. ప్రతినిత్యం నవగ్రహపూజలు, దేవస్థాన యాగశాల నందు గణపతి హోమం, నవగ్రహ హోమం, నిత్య రుద్ర హోమములు, సుబ్రహ్మణ్య, చండీ హోమములు, పాశుపత హోమములు, శాంతి కల్యాణం జరుపుట ద్వారా సకల దోష నివారణ, సర్వకార్య సిద్ధి కలుగుతుందని ఆలయ స్థానాచార్యులు పొత్తూరి సాంబశివరావు తెలిపారు.

చిన్నారుల ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేయాలి

పొన్నూరు: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పి వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలని ఎంఈఓ 2 కె.శ్రీనివాసరెడ్డి అన్నారు. నిడుబ్రోలులోని జెడ్పీ ఉన్నత పాఠశాల, నేతాజీ నగర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో బుధవారం జ్ఞానజ్యోతి కార్యక్రమంపై అంగన్‌వాడీ కార్యకర్తలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆటపాటలతో బోధన సాగించి పిల్లల్లో పఠనాసక్తిని పెంచాలని పేర్కొన్నారు. ఇదే సమయంలో వారి ఆరోగ్యంపైనా దృష్టి పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం రాష్ట్ర కన్వీనర్ కె.రాజశేఖరరెడ్డి, ఎంఈఓ- 1 ఆర్. చలపతిరావు, డీఆర్‌పీలు ఎ.వీరవర్ధన్, డి.మనోహర్, జి.భాస్కరరావు, జి.లక్ష్మీ పద్మావతి, వెంకట రమణ పాల్గొన్నారు.

ప్లానింగ్ సెక్రెటరీ, టీపీబీఓ సస్పెన్షన్

నెహ్రూ నగర్: కార్పొరేషన్ విధుల్లో నిర్లక్ష్యం వహించిన స్థానిక వార్డు సచివాలయ ప్లానింగ్ కార్యదర్శి, టీపీబీఓలను విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదే విధంగా టీపీఎస్, ఏసీపీ, డీసీపీ, సిటీ ప్లానర్లలకు షోకాజ్ నోటీసులు జారీ చేశామని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

కేన్సర్ చికిత్సలో అందుబాటులోకి ఆధునిక పద్ధతులు



డాక్టర్ హనీషా

గుంటూరు ఎడ్యుకేషన్: కేన్సర్ చికిత్సలో ఆధునిక వైద్య పద్ధతులు అందుబాటులోకి వచ్చాయని ఒమేగా హాస్పిటల్స్‌కు చెందిన కన్సల్టెంట్ మెడికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ పోలవరపు హనీషా పేర్కొన్నారు. బుధవారం అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాల ఫార్మసీ ప్రాక్టీసు విభాగం- మహిళా సాధికార విభాగ ఆధ్వర్యంలో ఒమేగా హాస్పిటల్స్ సంయుక్తంగా కేన్సర్ నివారణ, చికిత్సపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎస్.మధుసూదనరావు అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ హనీషా మాట్లాడుతూ మన దేశంలో సంభవించే వివిధ రకాల కేన్సర్ వ్యాధులు, వాటి లక్షణాలు, నిర్ధారణ పరీక్షలు, చికిత్సా విధానాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులకు వివరించారు. బ్రెస్ట్ కేన్సర్ సర్వైకల్ కేన్సర్ నిర్ధారణ, చికిత్సను అందించడంలో ఒమేగా హాస్పిటల్స్ గల వివిధ సదుపాయాలను తెలియజేశారు. కళాశాల గౌరవ చైర్మన్ డాక్టర్ మన్నవ రాధాకృష్ణమూర్తి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం మాట్లాడారు. కార్యక్రమంలో మహిళా సాధికార విభాగ సమన్వయకర్త జి.ఇందిరా ప్రియదర్శిని, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సీతారామయ్య, ఫార్మసీ ప్రాక్టీసు విభాగాధిపతి డాక్టర్ ఎన్.హేమకుమారి, వి.మౌనిక పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ బాధితులకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి



తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

లక్ష్మీపురం: అగ్రిగోల్డ్ బాధితులకు బడ్జెట్‌లో నిధులు కేటాయించి న్యాయం చేయాలని కోరుతూ తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్‌కు వినతిపత్రం అందజేశారు. అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం ఆయన కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకుడు బి.వి.చంద్రశేఖరరావు మాట్లాడుతూ అగ్రిగోల్డ్ కేసుల సత్వర పరిష్కారానికి ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేయించాలని కోరారు. కోట మాల్యాద్రి మాట్లాడారు. ఎమ్మెల్యే నసీర్ స్పందించి అగ్రిగోల్డ్ బాధితుల గురించి సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకు వెళతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి కరిముల్లా, నగర కార్యదర్శి నాగరాజు, ప్రసాద్, వెంకటేశ్వరావు, అప్పారావు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలి

డీఈఓ సీవీ రేణుక



టెన్త్ విద్యార్థినులకు ప్రేరణ కల్పిస్తున్న డీఈఓ రేణుక

గుంటూరు ఎడ్యుకేషన్: పదో తరగతి పరీక్షల్లో జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు నూరు శాతం ఉత్తీర్ణత సాధనకు ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక పేర్కొన్నారు. నగరంపాలెంలోని స్టాల్ బాలికోన్నత పాఠశాలను బుధవారం సందర్శించారు. టెన్త్ విద్యార్థినులకు నిర్వహిస్తున్న తరగతులను పరిశీలించారు. పబ్లిక్ పరీక్షలకు వ్యవధి తక్కువగా ఉన్నందున ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. విద్యాశాఖ ఇచ్చిన వంద రోజుల ప్రణాళికలో భాగంగా వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపి, ఉదయం, సాయంత్రం అదనపు తరగతుల్లో బోధన అందించాలని అన్నారు. పాఠశాలలో చదువుతున్న ప్రతి విద్యార్థి కచ్చితంగా ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని ఆదేశించారు. ఈసందర్భంగా విద్యార్థినుల్లో అభ్యసన సామర్థ్యాన్ని పరిశీలించిన డీఈవో రేణుక టెన్త్ పబ్లిక్ పరీక్షలకు అవసరమైన సూచనలు అందించారు. ప్రతి ఒక్కరూ మంచి మార్కులతో ఉత్తీర్ణులయ్యే విధంగా చూడాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఆమె వెంట ఉపాధ్యాయులు ఉన్నారు.

సివిల్ సప్లయిస్ హమాలీల నిరసన



ఏంఎల్ఎస్ పాయింట్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఏఐటీయూసీ సివిల్ సప్లయిస్ హమాలీ యూనియన్ నాయకులు

లక్ష్మీపురం: సివిల్ సప్లయిస్ అధికారుల తీరుపై ఏఐటీయూసీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ హమాలీ(ముఠా) వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చల్లా చిన్నఆంజనేయులు, ఎస్. వెంకటసుబ్బయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. బస్టాండ్ సమీపంలోని ఎంఎల్ఎస్ పాయింట్‌లో రాష్ట్ర యూనియన్ పిలుపులో భాగంగా బుధవారం ఏఐటీయూసీ సివిల్ సప్లయిస్ హమాలీ యూనియన్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సివిల్ సప్లయిస్ హమాలీ (ముఠా) వర్కర్ల కూలీ రెట్ల పెంపు జీవో విడుదల విషయంలో కాలయాపన తగ్గదన్నారు. యూనియన్ ఉపప్రధాన కార్యదర్శి రావుల అంజిబాబు అసెంబ్లీ సమావేశాల లోపైన జీఓ విడుదలకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్మికులు దానం, డేవిడ్, సురేష్, నాగరాజు, కాంతారావు, ముత్యాల బాబు, వినుకొండ జాన్ బాబు పాల్గొన్నారు.

రిజర్వాయర్లను శుభ్రం చేయాలి

కమిషనర్ పులి శ్రీనివాసులు



రిజర్వాయర్ పరిశీలిస్తున్న కమిషనర్

నెహ్రూ నగర్: గుంటూరు నగరపాలక సంస్థ తాగు నీటి రిజర్వాయర్లను నిర్దేశిత గడువు మేరకు శుభ్రం చేయాలని, ఇంజినీరింగ్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. రెడ్డిపాలెం రిజర్వాయర్, వెహికిల్ షెడ్, సంజీవయ్య నగర్ రోడ్ విస్తరణ పనులు, నవ భారత్ నగర్, జేకేసీ నగర్‌లోని పలు ప్రాంతాలలో పర్యటించి పారిశుద్ధ్యం, అభివృద్ధి పనులు బుధవారం పరిశీలించారు. తాగునీటి సరఫరా వ్యవస్థ అత్యంత కీలకమని, తాగునీటి శుద్ధి జరిగే హెడ్ వాటర్ వర్క్స్‌లో ప్రత్యేకంగా ల్యాబ్‌లో క్లోరిన్, నాణ్యత పరిశీలించిన అనంతరమే రిజర్వాయర్లకు సరఫరా జరుగుతుందని పేర్కొన్నారు. ప్రతి ఏఈ పరిధిలో రానున్న వేసవిని దష్టిలో ఉంచుకొని పైప్ లైన్ మరమ్మతులను వెంటనే పూర్తి చేయాలని, ఎక్కడా తాగునీటి సరఫరా అందలేదనే ఫిర్యాదు రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వెహికల్ షెడ్‌ని పరిశీలించి, ప్రతి రోజు ఉదయం, మధ్యాహ్నం సమయాల్లో పారిశుధ్య పనులకు పంపే వాహనాలు తప్పనిసరిగా నిర్దేశిత సమయానికి వెళ్లాలన్నారు. ఈ-ఆటోలు, పుష్ కాట్స్, ఇతర వాహనాలు ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయించాలని ఏఈని ఆదేశించారు. సంజీవయ్య నగర్ గేటు నుంచి రెడ్డిపాలెం రోడ్ వరకు చేపట్టిన విస్తరణ పనులను పరిశీలించి, ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక అధికారులు సమన్వయంతో పనులను వేగంగా పూర్తి చేయాలన్నారు. త్వరలో శంకర్ విలాస్ ఆర్ఓబీ పనులు ప్రారంభమైతే ట్రాఫిక్ సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున పనులు వేగంగా పూర్తి చేయాలని చెప్పారు. పర్యటనలో డీఈఈలు రమేష్ బాబు, కళ్యాణరావు, సతీష్ కుమార్, ఏసీపీ రెహ్మాన్, ఆర్ఓ రవికిరణ్ రెడ్డి, ఎస్ఎస్ ఆయుబ్ ఖాన్, ట్యాక్స్ పేయర్స్ అసోసియేషన్ అధ్యక్షులు నారాయణరెడ్డి పాల్గొన్నారు.

కార్మికుల కుటుంబాలకు అండగా ఉంటాం

నెహ్రూ నగర్: కార్మికుల కుటుంబాలకు గుంటూరు నగర పాలక సంస్థ తరపున అండగా ఉంటామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. ఇటీవల మరణించిన ప్రజారోగ్య విభాగ అవుట్ సోర్సింగ్ కార్మికులు జూటూరి వెంకటేశ్వర రావు, బంగారు సింహాద్రి కుటుంబ సభ్యులకు బుధవారం ఎక్స్‌గ్రేషియా చెక్‌లను కమిషనర్ చాంబర్‌లో వారి కుటుంబ సభ్యులకు అందించారు.

సీసీ కెమెరాలు అందజేసిన కిమ్స్ శిఖర హాస్పిటల్



గుంటూరు మెడికల్: సామాజిక బాధ్యతలో భాగంగా పాతగుంటూరు పోలీసులకు ఎనిమిది సీసీ కెమెరాలను గుంటూరు కిమ్స్ శిఖర హాస్పిటల్ నిర్వాహకులు బుధవారం అందజేశారు. మంగళదాస్‌నగర్‌లోని హాస్పిటల్‌లో కిమ్స్ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్ బోర్డు ఆఫ్ డైరెక్టర్ అభ్రిక్ బొల్లినేడి, సీఓఓ సుధాకర్ యాదవ్‌లు పాతగుంటూరు పోలీసులకు కెమెరాలు అందజేశారు. పాతగుంటూరు సీఐ వై.వి.సోమయ్య, ఎస్ఐలు ఎన్.సి.ప్రసాద్, ఎస్.కె.అబ్దుల్ రహమాన్ ఈకార్యక్రమంలో పాల్గొన్నారు.

ఛత్రపతి శివాజీ మహారాజ్‌కు నివాళి



నగరంపాలెం: స్థానిక కొరిటెపాడు పార్క్ ఆవరణలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహం వద్ద బుధవారం జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కోటేశ్వరరావు, ఏపీ మరాఠా సంఘ్ కార్యదర్శి జాజమ్ సుబ్రహ్మణ్యం, గౌరవ సలహాదారు సిందే లక్ష్మీనారాయణ, సభ్యులు కావే రామయ్య, శ్రీనివాసరావు, నిక్కము తనజీ, బాబర్ విఠోబా, దుర్యోధన్ పాటిల్, రామచంద్ర పాటిల్, మోతే శేషగిరిరావు, చిరుమామిళ్ల గోపికృష్ణ, విశ్వ హిందూ పరిషత్ రాష్ట్ర నాయకులు తిరుపతిరావు, బాణాల ఆంజనేయులు నివాళులర్పించారు.

వ్యాపారిపై పశ్చిమ ఎమ్మెల్యే ప్రధాన అనుచరుడి దాడి

లక్ష్మీపురం: ఓ వ్యక్తిపై టీడీపీ పశ్చిమ ఎమ్మెల్యే ప్రధాన అనుచరుడి మద్దతుదారులు దాడి చేసిన ఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాలు.. విద్యానగర్ ప్రాంతానికి చెందిన రాయపాటి అప్పారావు, చిట్స్, రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. గుంటూరు క్లబ్‌లో అప్పారావుకు టీడీపీ ఎమ్మెల్యే గల్లా మాధవి ప్రధాన అనుచరుడిగా చెప్పుకుంటున్న శివప్రసాద్ అలియాస్ బెంగళూరు శివతో వాగ్వాదం చోటుచేసుకుంది. తోటి స్నేహితులు ఇద్దరికి సర్ది చెప్పడంతో రాత్రి 10.30 గంటలకు వెళ్లిపోయారు. ఎమ్మెల్యే అనుచరుడు ఉద్దేశపూర్వకంగా సుమారు 15 మంది అనుచరులతో విద్యానగర్‌లోని అప్పారావు ఇంటికి వెళ్లి దాడి చేశారు. గాయాలపాలైన అప్పారావును ప్రభుత్వ సమగ్రాస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో వైద్యులు అందుబాటులో లేకపోవడంతో బాధితుడిని నగరంపాలెం ఓ కార్పొరేట్ ఆస్పత్రికి తరలించినట్లు బంధువులు తెలిపారు.